**విలేకరులు కావలెను**

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రిక.

సంప్రదించాల్సిన చిరునామా..

నిజామాబాద్ సెల్ : 9440731515

epaper.prajashankaravam.com

తెలుగు డైలీ ఈ-పేపర్

RNI NO: TELTEL/2022/85170

# ప్రజా శంఖారావం

తెలుగు దిన పత్రిక

ప్రతి అక్షరం.. ప్రజా స్వరం..

PRAJA SHANKARAVAM TELUGU DAILY

పేజీలు 8

గురువారం 04.06.2026 | సంపుటి: 04 | సంచిక: 24 | వెల: రూ. 3/- | ఎడిటర్: పుట్టి మురళి

హైదరాబాద్ | ఆదిలాబాద్ | నిర్మల్ | నిజామాబాద్ | కామారెడ్డి | జగిత్యాల | మంచిర్యాల | సిద్దిపేట్ | రాజన్న సిరిసిల్ల | సంగారెడ్డి | మెదక్



## తెలంగాణలో పెట్టుబడులకు స్వాగతం

- దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్ భేటీ
- వాణిజ్య, పెట్టుబడి భాగస్వామ్యంపై చర్చలు
- పెట్టుబడిదారులకు అన్ని విధాల సహకారం అందిస్తామన్న సీఎం

**హైదరాబాద్, జూన్ 3 (ప్రజాశంఖారావం):** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు అవసరమైన అన్ని విధాల సహకారం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థలో దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ షిపాకోసా మషటైల్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో సమావేశమైంది.

ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ

మిగతా 2వ పేజీలో..



4

## కర్నాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం

- ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్
- సిద్దరామయ్య, ఖర్గేల తనయులకు కేబినెట్‌లో చోటు
- హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్, రేవంత్ రెడ్డి

## ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం

- విదేశీయులు సహా 21 మంది మృతి
- 40 మందికి పైగా రక్షణ.. పలువురి పరిస్థితి విషమం
- మృతుల కుటుంబాలకు పరిహారం: మోదీ



4

# బడే భాయ్‌తో యుద్ధానికి సిద్ధమా?

- ధాన్యం కొనుగోలుపై కేంద్రానికి సీఎం డెడ్‌లైన్
- 15 తర్వాత పోరాటమే అంటున్న చోటే భాయ్
- రైతుల కోసం ఢిల్లీ వరకు వెళ్తామంటూ వార్నింగ్
- కేంద్రంపై ఒత్తిడి పెంచుతున్న రేవంత్
- పూర్తి ధాన్యం కొనాలంటూ డిమాండ్
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ లేదంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**తెలంగాణ బ్యూరో, జూన్ 3(ప్రజాశంఖారావం)** ధాన్యం కొనుగోలు వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ ప్రభుత్వం దూకుడు పెంచుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల వరుసగా చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా, ఆదిలాబాద్‌లో నిర్వహించిన సభలో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. తెలంగాణలో రైతులు పండించిన వరి, మొక్కజొన్న, సన్‌ఫ్లవర్ పంటలను కేంద్రం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 వరకు రైతులు తీసుకొచ్చే ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. అదే సమయంలో రాష్ట్రం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం కూడా పూర్తిగా తీసుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. కేంద్రం ధాన్యం కొనుగోలు విషయంలో

మిగతా 2వ పేజీలో..

## రైజింగ్ కాదు.. ఫాలింగ్ తెలంగాణ



- కాంగ్రెస్ హామీలు గాలిలో కలిశాయి
- రాష్ట్ర అభివృద్ధిని పక్కనబెట్టి కేసీఆర్‌పైనే దృష్టి
- తెలంగాణ అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- రైతులకు ముప్పు తెచ్చే నిర్ణయాలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

**తెలంగాణ భూమిపుత్రుల జాగీరే..** 2

## శాస్త్రీయంగా భూముల విలువల సవరణ

- క్షేత్రస్థాయి అధ్యయనం ఆధారంగా కొత్త విలువల నిర్ణయం
- ఈ నెల 5 నుంచి అమలు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 3 :** రాష్ట్రంలో భూముల విలువలను సవరించాలని, వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చు తగ్గులున్నచోట్ల క్రమబద్ధీకరించాలని

మిగతా 2వ పేజీలో..





2

### విధి నిర్వహణలో మృతి చెందిన లైన్‌మెన్ కుటుంబానికి రూ. కోటి బీమా చెక్కు



## ఆన్లైన్ బెట్టింగ్ పై సుప్రీంకోర్టు కొరడా...

- జూదం మౌలిక హక్కు కాదు..
- రమ్మీ...పోకర్ యాప్ లకు నో ఎంట్రీ..
- దేశవ్యాప్త నిషేధానికి దారి.. రాష్ట్రాలకే ఫుల్ పవర్స్..

**ఢిల్లీ, జూన్ 3 :** ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నైపుణ్యంతో కూడిన

మిగతా 3వ పేజీలో..

## పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షా లు

- రాష్ట్రానికి వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక
- ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు

**హైదరాబాద్, జూన్ 3:** రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. పలు జిల్లాల్లో మోస్తరు నుండి

మిగతా 3వ పేజీలో..






### 'కోర్' భూముల ధరలకు రెక్కలు

ఇప్పటికే రాయదుర్గం ఏరియా వేలంలో ఎకరాకు రూ.204 కోట్లు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు నిర్వాసితులకు రికార్డు స్థాయిలో పరిహారం

2



## ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి

- ఈ ఏడాది వర్షపాతం తక్కువ నమోదయ్యే అవకాశం
- ఖరీఫ్ సాగు ప్రణాళిక సమావేశంలో మంత్రి తుమ్మల

**ఖమ్మం, జూన్ 3(ప్రజాశంఖారావం) :** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, వైరా,

మిగతా 3వ పేజీలో..

# తెలంగాణ భూమిపుత్రుల జాగీరే..

- మనసుల్లో విభజన రేఖలు వద్దన్న పవన్ కల్యాణ్
- తెలంగాణలో అడుగుపెట్టనివ్వమనే వ్యాఖ్యలకే నా స్పందన
- కేటీఆర్‌తో సోదర సంబంధాలు ఉన్నాయని వెల్లడి
- రౌడీయిజానికి భయపడితే రాజకీయాలు చేయలేం
- మూడు రాజధానులు విఫలమై ఇప్పుడు మూడు జిల్లాలంటున్నారని ఎద్దేవా
- కుల, ప్రాంతీయ విద్వేష రాజకీయాలకు చరమాంకం పలకాలన్న జనసేన అధినేత

3



## తెలంగాణ భూమిపుత్రుల జాగీరే..

- పవన్ కళ్యాణ్ మాకు నేర్పాల్సిన అవసరం లేదు!
- ఈ దేశంలో ఏ నాయకుడైనా పార్టీ పెట్టవచ్చు
- జనసేన కొత్తగా పోటీ చేసేదేముంది?
- దేశభక్తి గురించి పవన్ కళ్యాణ్ నేర్పాల్సిన అవసరం లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూన్ 3

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. దేశంలో ఎవరికైనా పార్టీ పెట్టే హక్కు ఉందని, ఎక్కడైనా ఎన్నికల్లో పోటీ చేసే స్వేచ్ఛ ఉందని చెప్పిన ఆయన.. ఏ ప్రాంతంలో రాజకీయాలు చేయాలనుకుంటే ఆ ప్రాంత చరిత్ర, పోరాటాలు, ప్రజల భావోద్వేగాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ గతంలో (2023) కూడా తెలంగాణలో ఎన్నికల్లో పోటీ చేశారని, ఆయనను ఎవరూ అడ్డుకోలేదని గుర్తు చేశారు. గత పన్నెండేళ్లలోనో ఆయనకు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున రాజకీయ సభ నిర్వహించాల్సిన అవసరం పవన్‌కు ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రాంతీయవాదం గురించి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'మద్రాస్ రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ దీక్ష కూడా ప్రాంతీయవాదమేనా?. తెలంగాణ ఉద్యమం కూడా ప్రజల ఆకాంక్షల కోసం జరిగిన పోరాటమే. దానిని తప్పుగా చిత్రీకరించడం సరికాదు. దేశభక్తి విషయంలో మాకు ఎవరి దగ్గరా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పరిశ్రమలు గుజరాత్‌కు వెళ్లిపోయాయి. అదే సమయంలో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి మేము మద్దతు ఇచ్చాము' అని కేటీఆర్ గుర్తు చేశారు. 'పవన్ కళ్యాణ్‌ను ఉప ముఖ్యమంత్రిగా గౌరవిస్తాం, నటుడిగా అభిమానిస్తాము. పవన్ ఇంటికి వస్తే బిర్యానీ పెట్టి మర్యాద చేస్తాం. కానీ మా సచివాలయంలో కూర్చొని తెలంగాణ గురించి తక్కువ చేసి మాట్లాడితే ఊరుకోం. పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా చేశారు. తెలంగాణకు అసలైన ఓజీ కేసీఆర్. తెలంగాణ ఒక్క ఓజీ చాలు, ఇంకొకరు అసవరం లేదు. తెలంగాణ రాష్ట్రం సులభంగా వచ్చినది కాదు. వేలాది మంది త్యాగాలు, దశాబ్దాల ఉద్యమ ఫలితంగా రాష్ట్రం ఏర్పడింది. పవన్ కళ్యాణ్ అయినా, మరెవరైనా దేశంలో ఎక్కడైనా పోటీ చేయవచ్చు. అయితే తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని గౌరవించాల్సిందే. ఖచ్చితంగా తెలంగాణ భూమిపుత్రుల జాగీరే. ఈ రాష్ట్రం కోసం జరిగిన పోరాటాన్ని ఎవరూ తక్కువ చేసి చూడలేరు' అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.

## రైజింగ్ కాదు.. ఫాలింగ్ తెలంగాణ

హైదరాబాద్, జూన్ 3

హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర, రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర, బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

తెలంగాణ ఉద్యమం స్వాతంత్ర్య ఉద్యమం తరహాలో సాగిన గొప్ప ప్రజా పోరాటమని కేటీఆర్ అన్నారు. 1968 నుంచి ప్రారంభమైన ఉద్యమం అనేక దశల్లో కొనసాగిందని, వేలాది మంది యువకులు తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ ఉద్యమాన్ని అణచివేసిందని ఆరోపించారు.

2001లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించారని, 2004లో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుందని తెలిపారు. పదేళ్లపాటు సాగిన ఉద్యమంలో అనేక మంది విద్యార్థులు, యువకులు బలిదానాలు చేశారని, కేసీఆర్ పట్టుదల వల్లే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించాల్సి వచ్చిందన్నారు. తెలంగాణ సమాజం మొత్తం ఉద్యమంలో భాగస్వామ్యమైందని చెప్పారు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, రైతు సంక్షేమ పథకాలు, వైద్య రంగంలో చేపట్టిన కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేసిన రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని చెప్పారు.

తెలంగాణ సాధించిన అభివృద్ధికి సమానంగా మరో రాష్ట్రం అభివృద్ధి చెందిందని కాంగ్రెస్ లేదా బీజేపీ నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. కేసీఆర్ కుటుంబం మాత్రమే లబ్ధి పొందిందంటూ కాంగ్రెస్ చేసిన ప్రచారం పూర్తిగా అసత్యమని అన్నారు.

అధికారం కోల్పోవడం తమకు బాధ కాదని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వెనుక ఉన్న ఆకాంక్షలు నెరవేరకపోవడమే బాధ కలిగిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

"రైజింగ్ తెలంగాణ" అని చెబుతున్న కాంగ్రెస్ పాలన వాస్తవానికి "ఫాలింగ్ తెలంగాణ"గా మారిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా కేసీఆర్ పేరునే జపిస్తున్నారని ఆరోపించారు. భూముల వేలం ద్వారా వచ్చిన వేల కోట్ల రూపాయలను ఎక్కడ ఖర్చు చేస్తున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

రైతుల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదకర నిర్ణయాలు తీసుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. వ్యవసాయ విద్యుత్‌కు మీటర్లు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రైతు డిస్కం ఏర్పాటు ఆలోచన రైతులకు నష్టదాయకమని అన్నారు. వ్యవసాయ రంగానికి ముప్పు పొంచి ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## పోరాడితేనే తెలంగాణ వచ్చింది

- పవన్ వ్యాఖ్యలపై గద్దర్ తనయ వెన్నెల విమర్శలు

హైదరాబాద్, జూన్ 3:



తెలంగాణ అయ్య జాగీరా..? అంటూ జనసేన చీఫ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్, గద్దర్ కూతురు వెన్నెల తీవ్రంగా ఖండించారు. పవన్ కల్యాణ్ కామెంట్స్ నేపథ్యంలో వెన్నెల మాట్లాడుతూ.. పవనన్న మిమ్మల్ని ఒక నటుడిగా, గద్దరన్న అభిమానిగా తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ఎప్పుడూ గౌరవిస్తూనే ఉంటారు. కానీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు రు మాట్లాడిన మాటలను ఒక తెలంగాణ ఆడబిడ్డగా నేను ఖచ్చితంగా ఖండిస్తున్నానన్నారు. తెలంగాణ సినిమాల్లో నటిస్తే రాలేదు.. తెలంగాణ పొత్తులకు పోతే రాలేదు. పైసలు పంచితే రాలేదు.. లాబీలు చేస్తే రాలేదు. తెలంగాణ పోరాటం ఓ సాయుధ పోరాటం. తమ రక్తం చిందించిన గడ్డగా నిలబడ్డ తెలంగాణ బిడ్డల త్యాగాల పోరాటం. తెలంగాణ ఒక ఆత్మగౌరవపోరాటం. ఎవరినీ ఒక్క బాధపెట్టకుండా.. హింసించకుండా తమను తాము ఆహూతి చేసుకున్న శ్రీకాంతాచారే సాక్ష్యమన్నారు. తెలంగాణ పోరాటం ఒక సాంస్కృతిక యుద్ధం. పాటలతో మాటలతో ప్రజల్లోకి వెళ్లి.. గడపగడపకెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేసిన పోరాట గాథలున్న ఈ తెలంగాణ గడ్డ. మా భూములు మావి.. మా నీళ్లు మావి.. మా పాలన మాది అనే నినాదంతో ఫ్లెళ్లెళ్లె గడప గడప త్యాగాలు చేసి సాధించుకున్న పోరాట గడ్డ. తెలంగాణ మా అయ్యల జాగీరే, రేపు మా బిడ్డల జాగీరు కూడా అంటూ వెన్నెల వ్యాఖ్యానించారు.

# శాస్త్రీయంగా భూముల విలువల సవరణ

మొదటిపేజీ తరువాయి


మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మేరకు సవరించిన భూముల విలువలు ఈ నెల 5 నుంచి అమలులోకి వస్తాయని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఆర్థిక నిపుణుడు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక ప్రకారం ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని విస్తృత స్థాయిలో అధ్యయనం నిర్వహించిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రాంతాల వారీగా భూముల మార్కెట్ పరిస్థితులు, రిజిస్ట్రేషన్ల సంఖ్య, బహిరంగ మార్కెట్ ధరలు, ప్రభుత్వ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సమగ్రంగా పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో కొత్త విలువలను నిర్ణయించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి సమగ్ర కసరత్తు లేకుండా, అశాస్త్రీయ పద్ధతుల్లో 202122 సంవత్సరాల్లో కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రెండుసార్లు భూముల ధరలను పెంచడంతోపాటు రిజిస్ట్రేషన్ చార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందన్నారు. శాతం గణనల ఆధారంగా, పట్టికల ప్రకారం చేపట్టడం వల్ల కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే చాలా తక్కువగా, మరికొన్ని ప్రాంతాల్లో అధికంగా విలువల నిర్ణయం జరిగినట్లు తెలిపారు. వాస్తవ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకు మధ్య భారీ అంతరం ఉండటం వల్ల భూ లావాదేవీల్లో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల పునర్విమర్శ చేపట్టామని మంత్రి వెల్లడించారు.

గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు స్థానిక పరిస్థితులను పరిశీలించి సవరించిన విలువలను రూపొందించి ఆమోదించాయని చెప్పారు. ప్రాంతాల అభివృద్ధి సామర్థ్యం, వృద్ధి రేటు, ఇటీవలి భూముల వేలాలు, మార్కెట్ పరిస్థితులు, డిమాండ్, కొత్త రహదారులు, వృద్ధి కారిడార్లు, ఔటర్, రీజినల్ రింగ్ రోడ్, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విలువలను నిర్ణయించినట్లు తెలిపారు. ఫ్లాట్ల విషయంలో గతంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి మార్కెట్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ అంతస్తుల వారీగా అధిక రేట్లు నిర్ణయించడం వల్ల అసమానతలు ఏర్పడ్డాయని, అలాంటి చోట్ల అన్ని అంతస్తులకు ఒకే రేటు వర్తింపజేస్తూ మార్కెట్ విలువలను హేతుబద్ధీకరించినట్లు వివరించారు. ఇప్పటికే అధిక మార్కెట్ విలువలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపు ప్రతిపాదించలేదన్నారు.

అలాగే ప్రాంతాల అభివృద్ధి స్థాయినిబట్టి హెచ్ఎండీఏ, క్యూర్ పరిధి, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కనీస ప్రాథమిక రేట్లను కూడా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. నిర్మాణ వ్యయాలను కూడా 2021 తర్వాత సవరించలేదని, గత ఐదేళ్లలో నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో నిర్మాణ రేట్ల సవరణ అవసరమైందని పేర్కొన్నారు. అనేక మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ కావడం, గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడం వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఆర్‌సీసీ, నాన్‌ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వాస్తవ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సవరణలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, భూలావాదేవీలలో పారదర్శకత పెంపునకు, ప్రభుత్వ ఆదాయ వృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని మంత్రి పొంగులేటి చెప్పారు.

## తెలంగాణలో పెట్టుబడులకు స్వాగతం

మొదటిపేజీ తరువాయి



ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ-దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి ముఖ్యమంత్రి వివరించారు.

భారత్ అధికారిక పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన మషటైల్ బృందానికి ముఖ్యమంత్రి ప్రత్యేక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మషటైల్ మాట్లాడుతూ తెలంగాణలో తమ ప్రతినిధి బృందానికి లభించిన ఆత్మీయ స్వాగతానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. శాస్త్ర, సాంకేతిక, పెట్టుబడి సహకార రంగాల్లో తెలంగాణతో మరింత విస్తృత భాగస్వామ్యాన్ని ఆశిస్తున్నామని మషటైల్ పేర్కొన్నారు. భారత దేశంలోని అత్యంత యువ రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణ అతి తక్కువ కాలంలోనే దేశ ఆర్థికాభివృద్ధికి కీలకంగా తోడ్పడుతున్న రాష్ట్రంగా ఎదగడం అభినందనీయమన్నారు. తెలంగాణ ప్రజల పట్టుదల, సృజనాత్మకత, సంకల్పమే ఈ విజయాలకు కారణమని కొనియాడారు.

భారత్-దక్షిణాఫ్రికా సంబంధాల చారిత్రక నేపథ్యాన్ని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. సాంకేతికత, ఔషధ రంగం, వ్యాక్సిన్లు, రక్షణ, అంతరిక్ష పరిశోధన, విద్య, ఆరోగ్యం, తయారీ, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, మౌలిక సదుపాయాల రంగాల్లో తెలంగాణ విశేష పురోగతి సాధించిందన్నారు.

గ్రీన్ ఎనర్జీ, సుస్థిర అభివృద్ధి రంగాల్లో తెలంగాణ వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్న మంత్రి, ద్వైపాక్షిక సంబంధాల విస్తరణకు విస్తృత అవకాశాలు ఉన్న నేపథ్యంలో దక్షిణాఫ్రికా కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

## బడే భాయ్‌తో యుద్ధానికి సిద్ధమా?


మొదటిపేజీ తరువాయి

తెలంగాణకు అన్యాయం చేస్తోందన్న అభిప్రాయం రాష్ట్ర ప్రభుత్వంలో వ్యక్తమవుతోంది. ఛత్తీస్‌గఢ్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో సేకరించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తున్న కేంద్రం, తెలంగాణ విషయంలో మాత్రం పరిమితులు విధిస్తోందని ప్రభుత్వం ఆరోపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించి ధాన్యం కొనుగోళ్లు చేపడుతోందని అధికార వర్గాలు చెబుతున్నాయి. జూన్ రెండో వారంలోపు కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడిస్తున్నాయి. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను విపక్షాలు రాజకీయ అంశంగా మారుస్తున్నాయని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద బీజేపీ నేతలు నిర్వహిస్తున్న ఆందోళనలను సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం కృషి చేస్తుంటే కేంద్రం సహకరించడం లేదనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది.

ఈనెల 15 తర్వాత ఢిల్లీ కేంద్రంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ, ప్రజా ఒత్తిడి పెంచే కార్యాచరణకు కాంగ్రెస్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. అవసరమైతే బీజేపీ నేతల ఇళ్ల ముందు ధాన్యం పోసి నిరసన తెలియజేయాలనే ఆలోచన కూడా పార్టీ శ్రేణుల్లో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో కేంద్ర నాయకత్వంతో సఖ్యతగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఎదుర్కొన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్న సంకేతాలు ఇస్తున్నారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ధాన్యం కొనుగోలు అంశంపై కేంద్రం స్పందన, జూన్ 15 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే కార్యాచరణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## 'కోర్' భూముల ధరలకు రెక్కలు

తెలంగాణ బ్యూరో, జూన్ 3:



హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో, ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇటీవల రాయదుర్గం ఏరియాలో ప్రభుత్వం నిర్వహించిన వేలంలో ఎకరాకు రికార్డు స్థాయిలో రూ.204 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల కోసం రైతుల నుంచి భూములను సేకరించడం పెద్ద సవాలుగా మారింది. దీంతో భూసేకరణ ప్రక్రియ సజావుగా.. ఎలాంటి వివాదాలు లేకుండా సాగడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రికార్డు స్థాయి పరిహారం చెల్లించాల్సి వస్తోంది. తాజాగా ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన కొందరు రైతులకు ప్రభుత్వం రికార్డు స్థాయిలో పరిహారం అందించింది. ఎకరాకు ఏకంగా రూ.1.24 కోట్ల చొప్పున భారీ పరిహారాన్ని అందజేసింది.

**ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం 15 ఎకరాల భూసేకరణ**

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు ఆనుకుని, ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న కొంగర కలాన్, కొంగర ఖుర్ద్ గ్రామాల్లో ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. ఈ ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం 15 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. మార్కెట్ రేట్లు భారీగా ఉండటంతో జిల్లా యంత్రాంగం రైతులతో పలుమార్లు చర్చలు జరిపింది. చివరకు కుదిరిన ఒప్పందం ప్రకారం ఎకరాకు రూ.1.24 కోట్ల రికార్డు స్థాయి పరిహారాన్ని చెల్లించి భూములను స్వాధీనం చేసుకున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఎక్స్‌ప్రెస్‌వే వెళ్లే మార్గంలోని ఇతర లొకేషన్లను బట్టి రైతులకు ఎకరాకు రూ.30 లక్షల నుంచి రూ.98 లక్షల వరకు అందజేశారు. మారుమూల ప్రాంతాల్లో మాత్రం ఎకరాకు రూ.15 లక్షల చొప్పున చెల్లిస్తున్నారు. మరోవైపు.. రావిర్యాల్ ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట్ మీదుగా ఆమన్‌గల్ వరకు రెండు విడతల్లో దాదాపు రూ.4600 కోట్ల అంచనా వ్యయంతో 300 అడుగుల వెడల్పైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 1500 ఎకరాల భూమి అవసరం కానుంది. ఫేజ్ 1 కింద 447 ఎకరాల భూసేకరణ ఇప్పటికే పూర్తయింది. ఫేజ్ 2 కింద మరో 558 ఎకరాల భూసేకరణ ప్రక్రియ ప్రస్తుతం వేగంగా సాగుతోంది. ఈ భారీ ఎక్స్‌ప్రెస్‌వే రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూర్, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల గుండా వెళ్తుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన మొత్తం 1500 ఎకరాల భూమిలో దాదాపు 300 ఎకరాలు అటవీ భూమి కాగా.. మరో 200 ఎకరాలు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే ఫ్యూచర్ సిటీకి రవాణా కనెక్టివిటీ మరింత అద్భుతంగా మారనుంది.

## విధి నిర్వహణలో మృతి చెందిన లైన్‌మెన్ కుటుంబానికి రూ. కోటి బీమా చెక్కు

హైదరాబాద్, జూన్ 3

విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఎన్పీడీసీఎల్ లైన్‌మెన్ సోన్కాంబ్లే ప్రమోద్ కుమార్ కుటుంబానికి రూ.1 కోటి విలువైన ప్రమాద బీమా చెక్కును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో బుధవారం అందజేశారు.

ఎన్పీడీసీఎల్ పరిధిలో లైన్‌మెన్‌గా పని చేసిన ప్రమోద్ కుమార్ 2025 మార్చి 24న విధి నిర్వహణలో ఉండగా జరిగిన ప్రమాదంలో మరణించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎన్పీడీసీఎల్ కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం, USSA2, USSA3 శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు రూ.1 కోటి వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నారు.

ఈ పథకం కింద మృతుడి భార్య, నామినీ అయిన సోన్కాంబ్లే స్వప్న దాఖలు చేసిన క్లెయిమ్‌ను పరిశీలించిన బ్యాంకు అధికారులు రూ.1 కోటి బీమా మొత్తాన్ని మే 30న ఆమె ఖాతాలో జమ చేశారు. అనంతరం ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆమెకు బీమా చెక్కును అధికారికంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం, బ్యాంకింగ్ సంస్థల నిబద్ధతకు ఈ ఘటన నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, యూనియన్ బ్యాంక్ సీఈవో అశిష్‌పాండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్

- విద్యాశాఖ ఉత్తర్వులు జారీ



తెలంగాణ బ్యూరో, జూన్ 3:

రాష్ట్రంలోని ఇన్‌సర్వీస్ టీచర్ల కోసం ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణంగా ప్రతి ఏటా నిర్వహించే రెండు టెట్ పరీక్షలకు అదనంగా.. మరో రెండు ప్రత్యేక టెట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. పూర్తిగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసమే ప్రత్యేక టెట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. గత కొంతకాలంగా ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం.. ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రత్యేక టెట్ నిర్వహణకు సంబంధించి అధికారిక ఉత్తర్వులను కూడా జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో.. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి తదుపరి అవసరమైన అన్ని చర్యలనూ తక్షణమే చేపట్టాలని విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది

# పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షా లు

**మొదటిపేజీ తరువాయి**

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రాణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

**నేడు కేరళను తాకనున్న నైరుతి**

నైరుతి రుతుపవనాలు రాబోయే 24 గంటల్లో కేరళంలోకి ప్రవేశించ నున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. తద్వారా క్రమంగా దేశంలోని మిగతా ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించనున్నాయి. గురువారం నైరుతి రుతుపవనాలు.. నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, రాయలసీమ దుగా ఉత్తర తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతోంది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి

**మొదటిపేజీ తరువాయి**

సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ భారత వాతావరణ శాఖతో పాటు పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. జిల్లాలోని జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న డెడ్ స్టోరేజ్ నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, పచ్చి రొట్ట విత్తనాలను సబ్సిడీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే పంటలను రైతులు సాగు చేయాలని సూచించిన మంత్రి ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులు సాగు చేసే ప్రత్యామ్నాయ పంటల కొనుగోళ్లను కూడా ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని, మార్కెటింగ్ పరంగా పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. దేశంలోని అనేక రాష్ట్రాలు మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు, సోయాబీన్ వంటి పంటలను కొనుగోలు చేయకపోయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్‌తో పాటు 65 లక్షల టన్నుల వరిని కొనుగోలు చేసిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం సహకరించక పోయినా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో కొంత ఆలస్యం జరగడానికి డీజిల్ కొరత, బంగ్లాదేశ్ పరిస్థితుల కారణంగా గన్నీ బ్యాగుల సరఫరాలో అంతరాయం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత, లోడింగ్‌అన్‌లోడింగ్ సమస్యలు వంటి పలు కారణాలు ఉన్నాయని వివరించారు. కేంద్ర ప్రభుత్వం గిడ్డంగుల సామర్థ్యాలను పెంచకపోవడం, పాత నిల్వల సమస్యలు కూడా ప్రభావం చూపాయని తెలిపారు. అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఉద్యాన పంటలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, కల్లూరు ఫ్యాక్టరీ ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 10 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. దేశంలో పత్తి సాగు పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ విదేశాల నుంచి పత్తి దిగుమతులు చేయడం రైతులకు నష్టం కలిగిస్తోందన్నారు. అలాగే ఆయిల్ పామ్ దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించడం వల్ల దేశీయ రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దిగుమతి సుంకాలను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినప్పటికీ స్పందన లేదన్నారు. పురుగుమందుల అధిక వినియోగం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తుల ద్వారా మాత్రమే ప్రపంచ మార్కెట్లలో పోటీ పడగలమన్నారు. రైతులు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయ పద్ధతులు, నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు. రామగుండం ఎరువుల కర్మాగారం తరచూ ఉత్పత్తి నిలిపివేయడం, కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఖమ్మం జిల్లా ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, సిబ్బందిని అభినందించారు. జిల్లాలో అనేకసార్లు అవగాహన కల్పించినప్పటికీ కొంతమంది రైతులు వరి కొయ్యలు, పంట అవశేషాలను కాల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల పక్కనే ఉన్న పంటలు, తోటలకు నష్టం వాటిల్లడంతోపాటు కొన్ని ప్రాంతాల్లో ప్రాణనష్టం కూడా సంభవించిందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోతుందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, 'సుడా' చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత రావు పాల్గొన్నారు.

# బీసీ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల జాబితా విడుదల

- **ఎంజేపీ ఇన్‌చార్జి కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు**

**హైదరాబాద్, జూన్ 3 :**

మహాత్మా జ్యోతిబా పూలే(ఎంజేపీ) బీసీ గురుకుల విద్యాసంస్థల్లో 6, 7, 8, 9 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల రెండో జాబితాను బుధవారం విడుదల చేసినట్లు సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను సొసైటీ అధికారిక వెబ్ సైట్ • https://tgcet.cgg.gov.in/TGCETWEB/#/home , • https://mjptbcwreis.telangana.gov.in లో చూసుకో□వచ్చునన్నారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు సంబంధిత గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫోన్ ద్వారా సమాచారం అందిస్తారని, విద్యార్థులు ఏ తేదీన పాఠశాలకు హాజరు కావాలి అన్న వివరాలు తెలియ జేస్తారని తెలిపారు. మెరిట్ లిస్టులో ఎంపికైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సీట్ల కేటాయింపు, భర్తీ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుందన్నారు. బీసీ గురుకుల ఇంటర్ కోర్సుల్లో ఫస్ట్ లిస్టులో సీట్లు వచ్చిన విద్యార్థులు ఈనెల 4వ తేదీలోగా సంబంధిత కాలేజీలో రిపోర్టు చేయాలని డాక్టర్ మల్లయ్య తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏసీబీ దాడులు

- **మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు ఇళ్లలో సోదాలు**
- **ఆదాయానికి మించిన ఆస్తులపై విచారణ**
- **బంధువుల నివాసాలు, ఆస్తుల వద్ద కూడా తనిఖీలు**

**హైదరాబాద్, జూన్ 3:**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఆయనకు చెందిన ఇతర ప్రాంతాల్లో కూడా ఏకకాలంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. భుజంగరావు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ ఈ సోదాలు చేపట్టినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయన ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. భుజంగరావు బంధువులకు చెందిన ఇళ్లు, ఇతర ఆస్తుల వద్ద కూడా ఏసీబీ బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. తనిఖీల సందర్భంగా కీలక పత్రాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో భుజంగరావు కీలక నిందితుడిగా ఉన్నారు. గతంలో ఈ కేసులో అరెస్టైన ఆయన జైలుకు వెళ్లి అనంతరం బెయిల్‌పై విడుదలయ్యారు. ఇప్పుడు ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై ఏసీబీ దాడులు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సోదాలు పూర్తయిన తర్వాత స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల విలువల ఆధారంగా తదుపరి చర్యలపై అధికారులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# నకిలీ ఐపీఎస్ ముఠా గుట్టురట్టు

- **ప్రధాన నిందితుడితో పాటు నలుగురు అరెస్ట్..**
- **ఇద్దరు పరారీ**

**హైదరాబాద్, జూన్ 3:**

మేడ్చల్ జిల్లాలో సంచలనం సృష్టించిన నకిలీ పోలీస్ ముఠా గుట్టును కూకట్‌పల్లి సీసీఎస్, జగద్గిరిగుట్ట పోలీసులు రట్టు చేశారు. తాను ఐపీఎస్ అధికారినని చెప్పుకుంటూ అమాయకులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ప్రధాన నిందితుడు నాగరాజుతో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కుత్బుల్లాపూర్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నాగరాజు నకిలీ పోలీస్ ముఠాను నిర్వహిస్తున్నాడు. ఈ ముఠాలో పాత నేరస్థులతో పాటు ఓ కానిస్టేబుల్ కూడా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. అతడి సహకారంతో ఆరుగురు సభ్యులతో ప్రత్యేకంగా "సూడో పోలీస్ వ్యవస్థ" ఏర్పాటు చేసి నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగించారు. గత నెలలో పూర్ణచందర్ రావు అనే వ్యక్తిని లక్ష్యంగా చేసుకున్న ముఠా, తాము పోలీసులమని నమ్మించి కిడ్నాప్ చేసింది. అనంతరం తమ వద్ద ఉన్న నకిలీ పోలీస్ వాహనంలో సూర్యాపేటకు తీసుకెళ్లి బెదిరింపులకు పాల్పడింది. అక్కడ బాధితుడి నుంచి రూ.1 లక్ష నగదు వసూలు చేసిన నిందితులు, తర్వాత హైదరాబాద్‌కు తీసుకొచ్చి వదిలిపెట్టారు. అంతేకాకుండా మరో రూ.5.26 లక్షలు కాజేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. పాత నేరస్థుల వివరాలను పరిశీలించి నిందితుల ఆచూకీ కనుగొని వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నాగరాజుతో పాటు రాహుల్, సత్యభాన్ సింగ్, నాగేంద్ర వర్మలను అరెస్ట్ చేశారు. ప్రదీప్ కుమార్ మిశ్రా, సునీల్ కుమార్ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నాగరాజుపై ఇప్పటికే 12 క్రిమినల్ కేసులు నమోదై ఉండగా, రెండు పీడీ యాక్ట్ కేసులు, ఒక రౌడీషీట్ కూడా ఉన్నట్లు డీసీపీ తెలిపారు. నిందితుల నుంచి రెండు తుపాకులు, ల్యాప్‌టాప్, పోలీస్ యూనిఫాంలు, కారు, బైక్, లెటర్ ప్యాడ్లు, బేడీలు, రబ్బర్ స్టాంపులు, మొబైల్ ఫోన్లు, పోలీస్ హోదాలను సూచించే స్టార్లు, గుర్తులను స్వాధీనం చేసుకున్నారు.

# ఆన్లైన్ బెట్టింగ్ పై సుప్రీంకోర్టు కొరడా...

**మొదటిపేజీ తరువాయి**



ఆటలైనా సరే.. డబ్బులు పెట్టి బెట్టింగ్ కాస్తే రాజ్యాంగ రక్షణ ఉండదని న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు చేసిన చట్టాలు పూర్తిగా చెల్లుతాయని స్పష్టం చేసింది. ఆన్‌లైన్ జూదాలను నిషేధించే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని వెల్లడించింది. బెట్టింగ్ వ్యాపారం ఎవరికీ 'మౌలిక హక్కు' కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు, గేమింగ్ కంపెనీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది...

**డబ్బులు పందెంపై..సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది**

ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వాల నిషేధ చట్టాలను కొట్టివేస్తూ మద్రాస్, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సమర్థించింది. రాజ్యాంగం ప్రకారం బెట్టింగ్, జూదం అంశాలపై చట్టాలు చేసే సర్వాధికారాలు రాష్ట్రాలకే ఉన్నాయని స్పష్టం చేసింది. ఆట ఆడటానికి నైపుణ్యం అవసరమైనప్పటికీ, దానిపై డబ్బుల పందేలు కాస్తే అది జూదం కిందకే వస్తుందని న్యాయస్థానం తీర్పునిచ్చింది.

**సామాజిక పరిస్థితులను సుప్రీంకోర్టు పరిగణనలోకి...**

ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పులపాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. సమాజ హితం, శాంతిభద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై నిషేధం విధించడం సరైనదేనని న్యాయస్థానం సమర్థించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం నుంచి ఈ చరిత్రాత్మక తీర్పు వెలువడింది.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**దేవరకొండ, జూన్ 3:**

డిండి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ శివారు పరిధిలోని కోదాడజడ్చర్ల జాతీయ రహదారిపై తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఇదే ప్రమాదంలో 136 పైగా గొర్రెలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం నాగర్ కర్నూలు జిల్లా కోడేరు మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి చిట్టెగొండ ఎల్లయ్య (35) గుంటూరు జిల్లా నుండి డీసీఎం వాహనంలో గొర్రెలను ఎక్కించుకొని మంగళవారం తన స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో బ్రాహ్మణపల్లి శివారులో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన మరో వాహనాన్ని గొర్రెల లోడుతో వెళ్తున్న డీసీఎం బలంగా ఢీకొట్టడంతో ఎల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. 136కు పైగా గొర్రెలు కూడా మృతిచెందాయి. డీసీఎం డ్రైవర్ రాము తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫోన్ టాపింగ్ కేసు

**హైదరాబాద్, జూన్ 3:**


ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డికి సిట్. నోటీసుల ఇచ్చింది. ఈ కేసుకి సంబంధించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది సిట్. ఈమేరకు దీపక్ రెడ్డికి ఫోన్ కాల్ చేశారు సిట్ అధికారులు. విచారణకు ఎప్పుడొస్తారో చెప్పాలంటూ ఫోన్ కాల్ అడిగారు అధికారులు. ప్రశిక్షణ తరగతులు జరుగుతున్న క్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు అడిగి చెబుతానని బదులిచ్చారు దీపక్ రెడ్డి రెండు మ□డు రోజుల్లో దీపక్ రెడ్డి సిట్ ముందు హాజరు కానున్నట్లు తెలుస్తోంది. బండి సంజయ్ పాదయాత్ర, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కిషన్ రెడ్డి దగ్గర పని చేశారు దీపక్ రెడ్డి. ఇటీవల జరిగిన జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గా పోటీ చేశారు లంకల దీపక్ రెడ్డి. జూన్ 4 ఉదయం 11 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విచారణకు హాజరుకావాలంటూ తీగల కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది

# అమెరికాలో కారు ప్రమాదం !

- **మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ దంపతులకు గాయాలు**

**హైదరాబాద్, జూన్ 3 :**

అమెరికాలో జరిగిన కారు ప్రమాదంలో మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సతీమణి సీనియర్ డాక్టర్ ఎండోక్రినాలజిస్ట్, సుచి యాష్కీ గాయపడ్డారు. మధుయాష్కీగౌడ్ చిన్న కుమార్తె డాక్టర్ గగన యాష్కీని బోస్టన్ లోని హార్వర్డ్ యూనివర్సిటీ అనుబంధ హాస్పిటల్ లో ఎండీ కోర్సులో జాయిన్ చేసి తిరుగు ప్రయాణంలో న్యూయార్క్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. వర్షం కారణంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డాక్టర్ సుచియాష్కీకి రిబ్స్ విరిగినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతూ కోలుకుంటున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మధుయాష్కీగౌడ్ ప్రస్తుతం అమెరికాలోనే ఉన్నారు. డాక్టర్ గగన యాష్కీ న్యూయార్క్ మెడికల్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా, కాన్వొకేషన్ వేడుకకు హాజరయ్యేందుకు ఇటీవల మధుయాష్కీగౌడ్ అమెరికా వెళ్లారు. కుమార్తెను ఎండీ కోర్సులో జాయిన్ చేసే క్రమంలో లగేజీ ఎక్కువ ఉన్న క్రమంలో డాక్టర్ సూచి, మధుయాష్కీ వేర్వేరు కార్లలో వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా రేపు ఆయన ఇండియాకు తిరిగి రావాల్సి ఉండగా ఈ ప్రమాదం జరిగింది.




# తెలంగాణ భూమిపుత్రుల జాగీరే..

**అమరావతి, జూన్ 3:**

అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన అనంతరం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణపై తనకు అపారమైన గౌరవం ఉందని, తెలంగాణ పూర్తిగా అక్కడి భూమిపుత్రుల జాగీరేనని స్పష్టం చేశారు. అయితే తెలంగాణలో తనను అడుగు పెట్టనివ్వమంటూ కొందరు చేస్తున్న వ్యాఖ్యలకే తాను స్పందించానని తెలిపారు.

తెలంగాణ ప్రజలపై తనకు ఎలాంటి విరోధం లేదని, ప్రజా గాయకుడు గద్దర్ కూడా ఎప్పుడూ సంకుచిత ప్రాంతీయ భావజాలంతో మాట్లాడలేదని అన్నారు. భూమికి సరిహద్దులు గీయవచ్చని, కానీ మనసుల్లో గీసే విభజన రేఖలు సమాజాన్ని మరింత దూరం చేస్తాయని పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం, అభివృద్ధి వంటి ప్రధాన సమస్యలను పక్కనబెట్టి కొందరు నేతలు కుల, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ తమ మధ్య సోదర సంబంధాలు ఉన్నాయని పవన్ కల్యాణ్ తెలిపారు. కేటీఆర్‌తో తనకు పరస్పర గౌరవం, స్నేహం ఉన్నాయని, ఆయన తనపై తప్పుగా మాట్లాడి ఉంటారని అనుకోవడం లేదన్నారు. తెలంగాణలో కాంట్రాక్టుల అంశాన్ని లేవనెత్తుతున్న నేతలు గత పదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఎన్ని కాంట్రాక్టులు పొందారో లెక్కలు తీయాలని సూచించారు. తెలంగాణలో జనసేన పార్టీ పోటీ చేస్తే స్థానిక నాయకులే బరిలో ఉంటారని, ఇతర రాష్ట్రాల నాయకులను తీసుకురాబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు సభలు నిర్వహించుకోవడం సహజమని, వాటిని అడ్డుకోవడం సరికాదన్నారు.

రాజకీయ సభలను అడ్డుకోవడం, బెదిరింపులకు దిగడం వంటి చర్యలను ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రౌడీయిజానికి భయపడే వారు రాజకీయాల్లో ఉండరని, ఎన్నో కష్టాలు పడి జనసేన ఈ స్థాయికి చేరుకుందని చెప్పారు. తెలంగాణలో కూడా ప్రజల కోసం పార్టీ కేడర్ పనిచేస్తుందని తెలిపారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన "మావిగాన్" అంశంపై పవన్ కల్యాణ్ విమర్శలు చేశారు. గతంలో మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చి విఫలమయ్యారని, ఇప్పుడు కొత్త పేర్లతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రజల్లో తెలంగాణ భావన, తమిళనాడులో తమిళ అస్తిత్వం బలంగా ఉన్నాయని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రాంతీయ విభేదాలకు అతీతంగా ఒకే ఆంధ్ర భావన బలపడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

వైసీపీ పాలనలో రాజకీయ వ్యవస్థ దిగజారిపోయిందని పవన్ కల్యాణ్ విమర్శించారు. కులాల పేరుతో దూషణలు చేయడం, ప్రజలను వర్గాలుగా విభజించడం రాజకీయ సంస్కృతిగా మారిందన్నారు. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కుల, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టారని ఆరోపించారు. సమాజంలో విభజనకు దారితీసే ఇలాంటి రాజకీయాలకు చరమాంకం పలకాలనే లక్ష్యంతో తాము ముందుకు సాగుతున్నామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు



# బెంగాల్‌లో మమతకు బ్యాడ్ టైమ్!

## దూరమవుతున్న నేతలు.. టీఎంసీలో సంక్షోభం

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి. లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ధి చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమత మవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరఫున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరఫున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగుడుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుం టున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు ఢిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధికారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరువేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు. మమతను ప్రజలే ఛీత్కరించుకునే స్థాయికి వచ్చింది.

# ఢిల్లీలో ఘోర అగ్ని విషాదం

- విదేశీయుల సహా 21 మంది మృతి
- మాల్వీయానగర్ హోటల్‌లో బీభత్సం
- 40 మందికి పైగా రక్షణ.. పలువురి పరిస్థితి విషమం
- హోటల్ భద్రతా ప్రమాణాలపై దర్యాప్తు
- మృతుల కుటుంబాలకు పరిహారం : మోదీ






**న్యూఢిల్లీ, జూన్ 3:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుని 21 మంది మృతి చెందారు. మా ఓల్వీయా నగర్‌లోని హౌజ్ రాణి ప్రాంతంలో ఉన్న ఫ్లోరిష్ స్టే బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఈ విషాదం సంభవించింది. ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉదయం 8.50 గంటల సమయంలో అగ్నిప్రమాదం జరిగినట్లు ఢిల్లీ అగ్నిమాపక శాఖకు సమాచారం అందింది. వెంటనే అగ్నిమాపక దళాలు, పోలీసులు, విపత్తు స్పందన బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అయితే అప్పటికే భవనమంతా దట్టమైన పొగతో నిండిపోవడంతో లోపల ఉన్నవారిని బయటకు తీసుకురావడం సవాలుగా మారింది. సహాయక బృందాలు 40 మందికి పైగా బాధితులను రక్షించి వివిధ ఆసుపత్రులకు తరలించాయి. మాక్స్ ఆసుపత్రికి తరలించిన 39 మందిలో 18 మంది మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో 15 మందికి



ఐసీయూలో చికిత్స అందిస్తుండగా, వారిలో ఎనిమిది మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. స్వల్ప గాయాలైన కొందరిని చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు 13 మందిని తరలించగా, వారిలో భవనం నుంచి దూకిన బాధితులతో పాటు సహాయక చర్యల్లో పాల్గొన్న ఢిల్లీ పోలీసు సిబ్బంది కూడా ఉన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించినట్లు అధికారులు వెల్లడించారు. అగ్నిప్రమాదం కారణంగా భవనం తీవ్రంగా దెబ్బతింది. కాలిపోయిన వస్తువులు, శిథిలాలు, పగిలిన అద్దాల ముక్కలు పరిసర ప్రాంతాల్లో చెల్లాచెదురుగా కనిపించాయి. సహాయక చర్యలకు ఆటంకం కలగకుండా అధికారులు ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారి ఏకే మాలిక్ తెలిపిన వివరాల ప్రకారం, ప్రమాదం జరిగిన భవనంలో బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఐదు అంతస్తులు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెస్టారెంట్ ఉండగా, మిగిలిన భాగాన్ని హోటల్‌గా వినియోగిస్తున్నారు. వైద్య చికిత్సల కోసం భారతదేశానికి వచ్చే విదేశీయులు ఎక్కువగా ఈ హోటల్‌లో బస చేస్తుండటంతో మృతుల్లో విదేశీయుల సంఖ్య అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతులు ప్రధానంగా మధ్య ఆసియా, ఆఫ్రికా దేశాలకు చెందినవారని వెల్లడించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, మంటలు వ్యాపించడంతో కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు అద్దాలు పగులగొట్టి భవనం పై అంతస్తుల నుంచి కిందకు దూకారు. ఒక వ్యక్తి కిందపడటంతో కాలు విరిగినట్లు కనిపించిందని వారు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపు స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. కిందకు దూకిన వారికి గాయాలు తక్కువగా తగలేందుకు కొందరు నేలపై పరుపులు పరిచారు. మరికొందరు బాధితులకు అత్యవసర ప్రథమ చికిత్స అందించేందుకు ప్రయత్నించారు. ప్రస్తుతం సహాయక చర్యలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. హోటల్‌కు ఒకే ఒక్క ప్రవేశ, నిష్క్రమణ మార్గం ఉండటంతో పాటు అగ్నిమాపక శాఖ నుంచి అవసరమైన అనుమతులు, ఎన్‌ఓసీ ఉన్నాయా లేదా అనే అంశాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. అగ్నిప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు.

# గిరిజనాభివృద్ధికి రాష్ట్రపతి పిలుపు

## జాతీయ సదస్సుకు ప్రారంభం

## గిరిజన సంక్షేమంపై దృష్టి

## వికసిత భారత్ లక్ష్య సాధన




**న్యూఢిల్లీ, జూన్ 3 :** గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధిని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో నిర్వహించిన జాతీయ సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలు, సమీకృత గిరిజనాభివృద్ధి ప్రాజెక్టుల బలోపేతంపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం న్యూఢిల్లీలో జరిగింది. గిరిజనుల సామాజిక, ఆర్థిక పురోగతికి సంబంధించి పలు కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్రపతి బెంగళూరులోని భారత విజ్ఞాన సంస్థలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని, ఏకలవ్య ఆదర్శ నివాస పాఠశాలల్లో ఏర్పాటు చేసిన డెబ్బై ఐదు అంతరిక్ష ప్రయోగశాలలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక విద్యను గిరిజన విద్యార్థులకు చేరువ చేయడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. భారతదేశం రెండు వేల నలభై ఏడవ సంవత్సరానికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతోందని రాష్ట్రపతి అన్నారు. ఈ లక్ష్య సాధనలో గిరిజన సమాజాల సమగ్ర అభివృద్ధి అత్యంత కీలక భాగమని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధిలో గిరిజనుల పాత్ర మరింత పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉపయోగపడుతున్నాయని రాష్ట్రపతి పేర్కొన్నారు. అయితే ఆ పథకాలపై పూర్తి అవగాహన కలిగి వాటి ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన ప్రజలకు సూచించారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్రపతి సూచించారు. యువత ఆధునిక విద్యను అభ్యసించి కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. గిరిజన విద్యార్థులు విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వివరించారు. సమగ్ర అభివృద్ధి ద్వారానే గిరిజన సమాజాలు మరింత బలోపేతం అవుతాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. గిరిజనుల సాధికారత, విద్యా ప్రగతి, ఆర్థిక స్వావలంబన ద్వారా వికసిత భారత్ నిర్మాణంలో వారు కీలక భాగస్వాములుగా ఎదగాలని ఆకాంక్షించారు.

# కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం

- ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్
- మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం
- సిద్ధరామయ్య, ఖర్గేల తనయులకు కేబినెట్‌లో చోటు
- కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్ , రేవంత్ రెడ్డి



**బెంగళూరు, జూన్ 3:** కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు. జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి. పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మి హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

## సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, జూన్ 3:** ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా.. వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొంది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.

ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
గురువారం
జూన్ 4, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

## మున్సిపల్ కమిషనర్ గా రాకేష్ రెడ్డి



**తాండూరు, జూన్ 3(ప్రజా శంఖారావం):**

వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ నూతన కమిషనర్ గా పి రాకేష్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. బుధవారం కమిషనర్ ఛాంబర్ లో ఆయన కమిషనర్ గా బాధ్యతలను స్వీకరించారు. చార్జి తీసుకున్న అనంతరం కమిషనర్ మాట్లాడుతూ తాండూరు పట్టణ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని అన్నారు. ప్రజా ప్రతినిధులు సహకారంతో పట్టణ అభివృద్ధి చేపడతారని తెలిపారు. మోడల్ మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తానని ఆయన వివరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పి. నీరజను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు మేనేజర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు, వార్డ్ ఆఫీసర్లు సిబ్బంది, కమిషనర్ ని సన్మానించారు.

## శేట్లూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శికి సన్మానం



**జుక్కల్, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం శేట్లూర్ గ్రామపంచాయతీకి బుధవారం నూతనంగా వచ్చినటువంటి కార్యదర్శి మనోజ్ నును శేట్లూర్ కాళోజీ విఠల్ రావు సర్పంచ్ సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా కార్యదర్శి మనోజ్ మాట్లాడుతూ... అందరికీ ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామ ప్రజలు అందరూ సహకరించాలని అందరి కి ఎల్లవేళల అందుబాటులో ఉంటానని సమస్యను తమ దృష్టికి తీసుకొస్తే సమస్యలను పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు.అనంతరం శేట్లూర్ గ్రామానికి చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు సర్పంచ్ కాళోజీ విఠల్ రావు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకు, సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ తేజ రావు పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాళోజీ నాగ్ నాథ్ , లక్కవర్ విఠలావు, లక్కవర్ రచప్ప, సమాద్ పాల్గొన్నారు.

## మొఘలో 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట'




**జుక్కల్, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

కామారెడ్డి జిల్లా డోంగ్లి మండలం మొఘ గ్రామంలో 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని ఉపాధ్యాయ బృందం నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే చేపట్టి వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలో అమలు చేయనున్న కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించారు. గ్రామంలోని ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ హాలే బస్వంత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, రాగిజావ వంటి సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మరో క్లిష్ట ప్లాస్టిక్ సర్జరీ విజయవంతం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మరో క్లిష్టమైన ప్లాస్టిక్ సర్జరీ విజయవంతంగా నిర్వహించారు. నిజామాబాద్కు చెందిన మమత అనే రోగి కాలి భాగంలో దీర్ఘకాలంగా మానని గాయంతో బాధపడుతుండగా, ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్యులు బుధవారం విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగమోహన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ శివాని శస్త్రచికిత్స చేపట్టారు. శస్త్రచికిత్స విభాగాధిపతి డాక్టర్ విజయ్ కుమార్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ పూర్తయింది. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, గాయం సంతృప్తికరంగా మానుతోందని వైద్యులు తెలిపారు. ఈ చికిత్స ద్వారా రోగి కాలును సంరక్షించడంతో పాటు సాధారణ జీవన విధానానికి తిరిగి చేరుకునే అవకాశం కలిగిందన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఆధునిక ప్లాస్టిక్ సర్జరీ సేవలతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని వైద్య బృందం పేర్కొంది. క్లిష్టమైన శస్త్రచికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నట్లు వెల్లడించింది.

# తైబజార్ వేలం యోచన తెరపైకి..?

### రెండు నెలల్లోనే మారిన కౌన్సిల్ వైఖరి..?

- గతంలో ఏప్రిల్ 1 నుంచి తైబజార్ రుసుము వసూలు చేయొద్దని తీర్మానం..
- రైతులు, చిరు వ్యాపారుల కోసమేనంటూ అప్పట్లో ప్రకటన..
- కౌన్సిల్ తీర్మానాన్ని ఉన్నతాధికారులకు పంపిన మున్సిపల్ అధికారులు..!
- ఇప్పుడు మళ్లీ తైబజార్ వేలం నిర్వహించాలనే యోచన?
- కొందరు కౌన్సిల్ సభ్యుల వ్యతిరేకత..!




**ఆర్మూర్, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

రైతులు, చిరు వ్యాపారుల ప్రయోజనాల దృష్ట్యా తైబజార్ రుసుమును పూర్తిగా రద్దు చేస్తూ కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి మార్చి 30న జరిగిన కౌన్సిల్ సమావేశం అనంతరం ప్రకటించారు. ఏప్రిల్ 1 నుంచి మున్సిపల్ పరిధిలో ఎవరూ తైబజార్ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఆ తీర్మాన ప్రతులను జిల్లా కలెక్టర్‌కు పంపించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. అయితే, రెండు నెలలు కూడా పూర్తికాకముందే అదే కౌన్సిల్ సభ్యులు తైబజార్ వేలంపాటను తిరిగి నిర్వహించే యోచనలో ఉన్నట్లు సమాచారం వెలుగులోకి రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రతిపాదనపై కౌన్సిల్ సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. కొందరు సభ్యులు మున్సిపల్ ఆదాయం తగ్గిపోతుందని వాదిస్తుండగా, మరికొం దరు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సమా చారం. ప్రజా ప్రయోజనాల కోసమే తైబజార్ రద్దు నిర్ణయం తీసుకున్నామని గతంలో ప్రకటించిన పాలక వర్గం, ఇప్పుడు అదే వ్యవస్థను తిరిగి అమలు చేయాలనే యోచనలో ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. అప్పట్లో ప్రజల సంక్షేమమే లక్ష్యమని చెప్పిన నాయకులు, ఇప్పుడు ఏ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలిస్తున్నారనే ప్రశ్నలు పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**తైబజార్ కాంట్రాక్టర్ మంతనాలు..?**

గతంలో తైబజార్ టెండర్‌ను పొందిన ఓ కాంట్రాక్టర్ తిరిగి టెండర్ తనకే దక్కేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో సదరు కాంట్రాక్టర్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు కొందరు కౌన్సిలర్లతో మంతనాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వినిపి స్తున్నాయి. అయితే ఈ ప్రచారాలపై అధికారి కంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. గతంలో ప్రజా ప్రయోజనాల పేరిట తీసుకున్న నిర్ణ యాన్ని తిరిగి మార్చే ప్రయత్నాలు జరుగుతు న్నాయనే ప్రచారం నేపథ్యంలో మున్సిపల్ పాలకవర్గం తీరుపై విమర్శలు వ్యక్తమ వుతున్నాయి.

**స్వప్రయోజనాల కోసమేనా ఈ యోచన..?**

తైబజార్‌ను తిరిగి నిర్వహించాలనే ప్రతిపాదన వెనుక కొందరు ప్రజాప్రతినిధుల స్వప్రయోజనాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు కొందరు కౌన్సిలర్లు ఈ అంశంపై తెరవెనుక చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రజా ప్రయోజనాల పేరుతో రద్దు చేసిన వ్యవస్థను తిరిగి అమలు చేయాలనే యోచనపై పట్టణ ప్రజల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తైబజార్ అంశంపై మున్సిపల్ పాలకవర్గం తుది నిర్ణయం ఎలా ఉండబోతుందో, పార్టీ నాయకత్వం దీనిపై ఎలా స్పంది స్తుందనే అంశాలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి.

# పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
- బోనాలు,మొహర్రం పండగలపై స్పెషల్ ఫోకస్..!
- వికారాబాద్ ఎస్పీ స్నేహా మెహ్రా





**తాండూరు, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఆదేశించారు. తాండూరు పట్టణంలోని పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత మరియు సిబ్బంది విధి నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. ముఖ్యంగా స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, హిస్టరీ షీట్లు, ఆర్డర్ బుక్, బీట్ బుక్స్, వారెంట్ల అమలు స్థితిగతులతో పాటు స్వాధీనం చేసుకున్న ఆస్తుల రికార్డులు, కేసు ప్రాపర్టీల భద్రత వంటి పలు కీలక అంశాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..స్టేషన్‌లో ఎలాంటి రికార్డులను పెండింగ్‌లో పెట్టకూడదని, ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లల రక్షణ, వారిపై జరిగే నేరాల కేసుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉంటూ, ప్రత్యేక నిఘా ఉంచాలని, బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. శాస్త్ర సాంకేతికతను జోడించి రాత్రి వేళల్లో గస్తీ నిరంతరం కొనసాగించాలని, పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని పేర్కొన్నారు. రాబోయే ప్రతిష్టాత్మక బోనాలు, మొహర్రం పండుగలను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణపై అధికారులకు కీలక మార్గదర్శకాలు ఆమె జారీ చేశారు. పట్టణంలోని సమస్యాత్మక, ముఖ్యమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాల నిఘాను మరింత బలోపేతం చేయాలని, జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు వచ్చే విధంగా పనిచేయాలని సిబ్బందికి ఆమె సూచించారు. ఈ తనిఖీలో తాండూర్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, ఎస్ఐ లు, ఇతర సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మత్తు పదార్థాల నియంత్రణకు సమిష్టి గా కృషి చేయాలి

- అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలి
- నిజామాబాద్ అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్





**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి మత్తు పదార్థాల నిరోధక కమిటీ సమావేశంలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. మత్తు పదార్థాల నియంత్రణకు ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను సమీక్షించిన ఆయన, భవిష్యత్తులో అమలు చేయాల్సిన కార్యాచరణపై చర్చించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని వేదికలను వినియోగించుకోవాలని సూచించారు. కల్తీ కల్లు తయారీలో వినియోగిస్తున్న ఆల్ప్రాజోలం వంటి రసాయనాల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్లోరోఫాం, డైజోఫాం, ఆల్ప్రాజోలం తదితర పదార్థాలను ఉపయోగించి తయారు చేసే కల్తీ కల్లు సేవించడం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టి కల్తీ కల్లు, మత్తు పదార్థాల దుష్పరిణామాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై నిరంతర దాడులు కొనసాగిస్తూనే ప్రజల్లో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ఏర్పాటు చేసిన మత్తు పదార్థాల నిరోధక కమిటీలను మరింత బలోపేతం చేసి సమర్థంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత, డీఎంహెచ్‌వో రాజశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విషాదం మిగిల్చిన ఈత సరదా


- ఒకరి మృతి.. మరొకరి గల్లంతు..
- ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు
- యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన



**తాండూరు జూన్ 3 (ప్రజా శంఖారావం):**

కాగ్నా నదిలో ఈతకు వెళ్లిన ఇద్దరు స్నేహితుల్లో ఒకరు మృతి చెందగా మరొకరు నదిలో గల్లంతయ్యారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుభకార్యానికి వచ్చిన బంధువులతో కలిసి సరదాగా ఈతకొలను కోసమని యాలాల మండలం కోకట్ గ్రామ సమీపంలో ఉన్నకాగ్న నది కి కుటుంబ సభ్యులతో కలిసి ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో నదిలో చాకలి గుండ్ల మధ్యన లోతు ఉన్న ప్రదేశంలోకి ఇద్దరు వెళ్లి గల్లంతయ్యారు. దీంతో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు గల్లంతయ్యారు. విషయం తెలుసుకున్న యాలాల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వీరు పాత తాండూరుకు చెందిన వ్యక్తులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. ఇంకా పూర్తి వివరాలు చేయాల్సి ఉంది.

## రైతుల మోటార్ల కేబుల్ వైర్ల చోరీ



**భీమ్‌గల్, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం బడా భీమ్‌గల్ గ్రామ పరిధిలోని ఎల్లమ్మ వాగు సమీపంలో, సికింద్రాపూర్ రహదారి వెంట ఉన్న వ్యవసాయ పొలాల్లో దొంగలు బీభత్సం సృష్టించారు. రైతుల వ్యవసాయ మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లు, స్టార్టర్లు, బాక్సులను అపహరించారు. బుధవారం ఉదయం పంటలకు నీరు పెట్టేందుకు పొలాలకు వెళ్లిన రైతులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతుల మోటార్లకు అనుసంధానించిన కేబుల్ వైర్లను దుండగులు కత్తిరించి తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనలో సుమారు రూ.2.50 లక్షల విలువైన కేబుల్ వైర్లు, స్టార్టర్లు, బాక్సులు చోరీకి గురైనట్లు రైతులు గంగారం, ముచ్కూర్ నవీన్, రావుల మైపాల్, పల్లె గంగాధర్, ఉప్పు గంగాధర్, కుమ్మరి ప్రశాంత్, గణపయ్ మోహన్, గంపాయ్ గంగామోహన్, సందు సుమన్, కుమ్మరి శివ, కుమ్మరి గంగాధర్, సందు గంగాధర్ తదితరులు తెలిపారు. తరచూ జరుగుతున్న చోరీలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని, వ్యవసాయ పనులకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. చోరీలకు పాల్పడుతున్న దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వ్యవసాయ ప్రాంతాల్లో పోలీసులు నిఘా మరింత పెంచాలని బాధిత రైతులు కోరారు.

గురువారం
జూన్ 4, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com
ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM


# గ్రామ, వార్డు సభలు విజయవంతం చేయాలి

- అధికారులకు అదనపు కలెక్టర్ల ఆదేశాలు




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీల్లో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు అధికారులకు సూచించారు. సభల నిర్వహణపై బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు దిశానిర్దేశం చేశారు. మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులతో గ్రామ, వార్డు సభల్లో చర్చించాల్సిన అంశాలు, ప్రజలకు వివరించాల్సిన ప్రభుత్వ పథకాలు, అవగాహన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సభలకు ప్రజల భాగస్వామ్యం పెరిగేలా ఒక రోజు ముందుగానే టాంటాం, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనలో సహకరించేలా చైతన్యం తీసుకురావాలని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర కీలకమైనందున రాజకీయ పార్టీలు బీఎల్ఏలను నియమించి నిర్దేశిత నమూనాలో జాబితాలు సమర్పించేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో పంటల మార్పిడి, వర్షపు నీటి సంరక్షణ, సాగు నీటి పొదుపు వినియోగం, అవసరమైన మేరకే ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పచ్చదనం పెంపు, మొక్కల సంరక్షణ, అడవుల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆపదమిత్ర వాలంటీర్ల సేవల వినియోగం, నష్టపరిహార పథకాల వివరాలను సభల్లో తెలియజేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత, తడి–పొడి చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, వాల్టా, వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. రక్షిత మంచినీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించి, ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రజలను భాగస్వాములను చేయడంతో పాటు రహవీర్, ఆపద్బంధు, జాతీయ కుటుంబ ప్రయోజన పథకాలపై అర్హులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం, రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియ వివరాలను కూడా సభల్లో ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామ, వార్డు సభల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, డీఆర్వో గీత, డీఎఫ్‌వో సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి మేదరి సంఘం అండ



**ఇందల్వాయి, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమై సర్వస్వం కోల్పోయిన పేద కూలీ మేదరి నర్సయ్య కుటుంబానికి మహేంద్ర మేదరి సంఘం ప్రతినిధులు ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో నర్సయ్య అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల జరిగిన షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని నిత్యావసర వస్తువులు, బట్టలు, గృహోపకరణాలు కాలిపోవడంతో సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. విషయం తెలుసుకున్న మహేంద్ర మేదరి సంఘం సభ్యులు ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆపద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ సంఘం తరఫున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచిన సంఘ సభ్యులను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పిల్లి యుగంధర్, ధర్పల్లి ఎల్లయ్య, బాద గోవర్ధన్, నాగేష్, శివకుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు కూలి రాష్ట్ర మహాసభల గోడపత్రాల ఆవిష్కరణ



**కామారెడ్డి, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

హైదరాబాద్ కాచిగూడలోని తుల్జా భవన్‌లో ఈ నెల 9, 10 తేదీలలో జరగనున్న రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభల గోడపత్రాలను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పిరంగి రాజేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం, కౌలు రైతుల గుర్తింపు, భూమిలేని నిరుపేదలకు భూముల పంపిణీ, వరి ధాన్యం కొనుగోలు చేసి సకాలంలో చెల్లింపులు చేయడం, విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొత్తపల్లి మల్లన్న, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరామ్, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు ఎర్ర శివరాజు, తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, రైతులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**జుక్కల్, జూన్3, (ప్రజా శంఖారావం):**

కామారెడ్డి జిల్లా పిట్లం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో బుధవారం నిర్వహించిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు మరియు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ల్యాబ్, మెడికల్ హెల్త్ కోసం అవసరమైన మందులు మరియు నర్సింగ్ స్టాఫ్ కొరత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.రోగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు పొందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ విజయ్ భాస్కర్, సర్పంచ్ శేఖర్, ఆసుపత్రి సూపరిండెంట్ రవీందర్ మోహన్, వైద్యురాలు శుభాంగి, సంబంధిత అధికారులు సిబ్బంది ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**ఎడపల్లి, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

ఎడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 53 మంది లబ్ధిదారులకు చెక్కులను బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆడపడుచులకు భరోసా కల్పించే సంక్షేమ కార్యక్రమాలని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వివాహ ఖర్చుల భారం తగ్గించడంలో ఈ పథకాలు కీలకంగా దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక పథకాలను అమలు చేస్తోందని, అందులో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ముఖ్యమైనవని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ నుడా చైర్మన్ కేశవేణు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్లా రాంమోహన్, తహసీల్దార్ దత్తాత్రి, సర్పంచ్ కందకట్ల రాంచందర్, ఉపసర్పంచ్ మచ్కూరి గంగాధర్, బోధన్ సీడీసీ చైర్మన్ శంకర్ నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంస్థాగత బలోపేతంపై బీఆర్ఎస్ సమావేశం: గంప గోవర్ధన్

**కామారెడ్డి, జూన్ 3 (ప్రజా శంఖారావం):**



కామారెడ్డి నియోజకవర్గ బిఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఈ నెల 4న పట్టణంలోని వెలమ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తెలిపారు. ఆయన అధ్యక్షతన జరిగే ఈ సమావే శంలో పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమం, సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ హాజరుకానున్నారు. అలాగే నియోజకవర్గ ఇన్‌చార్జి ధపేదార్ రాజు, జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు హనుమంతు షిండే, బాజిరెడ్డి గోవర్ధన్, నల్లమడుగు సురేందర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ కళాశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ



**భీమ్‌గల్, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

భీమ్‌గల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం స్టూడెంట్స్ కు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇంత గొప్పనైనటువంటి సదా అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కళాశాలలో ప్రతి ఒక్క విద్యార్థి పాఠాలు విని ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా విద్యార్థులు కళాశాలకు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జైపాల్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీ సామగ్రి మాయం

- అధికారుల పర్యవేక్షణ లోపమా?



**కామారెడ్డి/ దోమకొండ, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

దోమకొండ గ్రామపంచాయతీలో గత కొన్ని సంవత్సరాలుగా నిల్వ ఉంచిన పాత సామగ్రి మాయం కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామపంచాయతీ ఆవరణలో ఉన్న పాత బోరు మోటర్లు, లైటింగ్ సామగ్రి, ఇనుప పైపులు, బోరింగ్‌కు సంబంధించిన పరికరాలు తదితర వస్తువులను బయటకు తరలించి గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, గ్రామపంచాయతీకి చెందిన పాత సామగ్రి ఇటీవల ఆవరణలో కనిపించకపోవడంతో ఈ వ్యవహారంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ విక్రయాలకు సంబంధించి గ్రామపంచాయతీ సాధారణ సమావేశంలో అధికారిక తీర్మానం జరిగిందా లేదా అన్నది స్పష్టత లేకపోవడం గమనార్హం. అలాగే పాత సామగ్రి విక్రయానికి సంబంధించి బహిరంగ వేలం లేదా టెండర్ ప్రక్రియ నిర్వహించారా? విక్రయించిన వస్తువుల పూర్తి జాబితా ఏమిటి? విక్రయం ద్వారా ఎంత మొత్తం వచ్చింది? ఆ నిధులు గ్రామపంచాయతీ ఖాతాలో జమ అయ్యాయా? సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారా? ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఈ ప్రక్రియ చేపట్టారా? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై గ్రామపంచాయతీ అధికారులు స్పందించి పూర్తి వివరాలను వెల్లడించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవాలు ఉన్నాయా లేదా అనే అంశంపై సంబంధిత శాఖ అధికారులు విచారణ చేపట్టి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

## ఇంజక్షన్లు ఇవ్వడంతో వ్యక్తి మృతి.. కుటుంబీకుల ధర్నా

**జుక్కల్, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

పిట్లం మండల కేంద్రంలోని యశోద దేవి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్ రావు పల్లి గ్రామానికి చెందిన కాంట్రపల్లి సాయిలు (68) తీవ్ర జ్వరంతో బాధపడుతూ బుధవారం ఉదయం తన కుమారుడు రాజుతో కలిసి పిట్లంలోని యశోద దేవి ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న డాక్టర్ శంకర్ సాయిలును పరీక్షించి రెండు ఇంజెక్షన్లు ఇచ్చారు. అయితే, ఇంజెక్షన్లు ఇచ్చిన సుమారు పది నిమిషాల్లోనే సాయిలు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ ఇచ్చిన ఇంజెక్షన్ల కారణంగానే తన తండ్రి మృతి చెందాడని కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఆంజనేయులు వెల్లడించారు.ఘటనకు దర్యాప్తులో సంబంధించిన పూర్తి వివరాలు తేలనున్నాయని ఎస్సై తెలిపారు.

# టీజీ ఎన్ ఆర్ జేసీ మెదక్ గర్ల్స్-1లో ఫుడ్ సేఫ్టీపై ఓరియంటేషన్




**మెదక్, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

మెదక్ జిల్లా, చేగుంట మండలం, ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని తెలంగాణ గురుకుల మైనారిటీ విద్యాసంస్థల (టీజీఎం ఆర్ ఐ ఈ ఎస్ ) పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న డిప్యూటీ వార్డెన్లు, కిచెన్ సిబ్బందికి ఆహార భద్రతపై ఒక రోజు ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టి జి ఎం ఆర్ జె సి మెదక్ గర్ల్స్–1 కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వదీప్ కుమార్, ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ డాక్టర్ రాజ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు ప్రొజెక్టర్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల (పీపీటీ ) ద్వారా ఆహార తయారీలో పరిశుభ్రత, బియ్యం మరియు నిల్వ విధానాలు, నాణ్యతా ప్రమాణాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు. గురుకులాల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడంలో డిప్యూటీ వార్డెన్లు, వంట సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని అధికారులు స్పష్టం చేశారు. ఈ శిక్షణా శిబిరంలో ఆర్ఎల్‌సీ డి. బహుమతి, విజిలెన్స్ అధికారులు గౌస్ పాషా, జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ గురుకులాల నుండి సుమారు 136 మంది సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరవగా, విజయవంతంగా ఆతిథ్యమిచ్చిన టీజీ ఎంఆర్ జెసి మెదక్ గర్ల్స్–1 ప్రిన్సిపాల్ ఆర్. సురేఖ వచ్చిన అధికారులను, శిక్షకులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
గురువారం
జూన్ 4, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

## పాదయాత్రకు ముందే పరిష్కారం నందినికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు

**కామారెడ్డి/బీబీపేట, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

జిల్లాలోని బీబీపేట మండల కేంద్రానికి చెందిన ఏల్లమైన నందిని తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు విషయంలో ఏర్పడిన సమస్యను పరిష్కరించాలంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్రగా బయలుదేరిన విషయం తెలిసిన వెంటనే అధికారులు స్పందించారు. సంబంధిత అధికారులు ఆమె దరఖాస్తును పరిశీలించగా, రెండో విడత లబ్ధిదారుల జాబితాలో పేరు ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఆన్‌లైన్‌లో వివరాలు కనిపించకపోవడం గుర్తించారు. దీంతో వెంటనే సమస్యను పరిష్కరించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు ప్రక్రియను పూర్తి చేశారు. అదనంగా, ఇంటి నిర్మాణానికి అవసరమైన మార్కౌట్ ప్రక్రియను కూడా పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం లబ్ధిదారురాలి సమస్య పూర్తిగా పరిష్కారమైందని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు. అధికారుల తక్షణ స్పందనతో నందిని కుటుంబానికి ఊరట లభించింది.

## వార్డుల సమస్యలపై కమిషనర్‌కు బీజేపీ వినతి



**కామారెడ్డి, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

కామారెడ్డి పట్టణంలోని 49 వార్డుల్లో నెలకొన్న సమస్యలను వార్డుల వారీగా జాబితా రూపొందించి బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ పర్వతాలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ, పట్టణంలోని చాలా వార్డుల్లో శానిటేషన్, సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వరద నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. పెద్ద డ్రైనేజీలలో పేరుకుపోయిన మట్టిని వెంటనే తొలగించి, గత వర్షాకాలంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ కౌన్సిలర్లు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన నూతన అధికారులు





**కామారెడ్డి, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎల్. మల్లిఖార్జున్ బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన పి. నర్సయ్య కూడా జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన అధికారులకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేయాలని సూచించినట్లు సమాచారం.

## రక్త దానం చేసి ప్రాణాన్నీ కాపాడిన రక్త దాత

**ఆర్మూర్, జూన్ 3 ( ప్రజా శంఖారావం):**




ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని సిరి మల్టీ స్పెషల్ హాస్పిటల్లో బుధవారం రోజు జక్రాన్ పల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బోయిడి స్రవంతి అనారోగ్యంతో ఉన్నందున అడ్మిట్ కావడం జరిగింది. డాక్టర్ల సూచన మేరకు పేషెంట్కు A నెగెటివ్ బ్లడ్ అవసరమని సూచించారు. విషయం తెలుసుకుని బోయిడి స్రవంతి, భర్త బోయిడి అశోక్, స్వామి బాయ్ బ్లడ్ ఫౌండేషన్, వ్యవస్థాపకులు మాదరి స్వామి,ని సంప్రదించిన వెంటనే నేనున్నానని భరోసా ఇచ్చి ముందుకు వచ్చి తన అమూల్యమైన రక్త దానం చేసి నిండు ప్రాణాన్ని కాపాడినందుకు పలువురు అభినందించారు. కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

**పటాన్ చెరువు, జూన్ 3 ( ప్రజా శంఖారావం):**

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గల శ్రీ గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవస్థానంలో సంకష్టహర చతుర్థి సందర్భంగా బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం శ్రీ సిద్ధి గణపతికి విశేష పంచామృత అభిషేకం నిర్వహించి, సింధూర వర్ణ అలంకరణతో స్వామివారిని అందంగా తీర్చిదిద్దారు. అనంతరం భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. మధ్యాహ్నం నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.సాయంత్రం శ్రీ గణపతి వ్రతం, భజన సంకీర్తనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, సిబ్బంది, ఆలయ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

- జూన్ 7లోగా మొక్కజొన్న సేకరణ పూర్తి చేయాలి
- కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి, జూన్ 3 (ప్రజా శంఖారావం):**

జిల్లాలోని సదాశివనగర్ మండలం పద్మాజీవాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లాలో మొక్కజొన్న సేకరణ ప్రక్రియను జూన్ 7లోగా పూర్తిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా గోదాములకు తరలించి, రైతులకు మద్దతు ధర ప్రయోజనాలు పూర్తిగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి**

మోడేగాం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవ ప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జిల్లాను గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే రెండో విడతలో పూరి గుడిసెల్లో నివసిస్తున్న అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 90 మంది లబ్ధిదారులకు రూ.1.59 కోట్ల బ్యాంకు రుణాలు అందించినట్లు తెలిపారు.

**విద్యా ప్రవేశాల పెంపుపై సమీక్ష**

విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అధ్యక్షతన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, "ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట" కార్యక్రమం ద్వారా ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. భవిత కేంద్రాల బలోపేతం, డిజిటల్ విద్య విస్తరణ, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫార్ముల పంపిణీని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఎమ్మెల్యే ను కలిసిన అంకాపూర్ గ్రామ పాలక వర్గం



**ఆర్మూర్ జూన్ 3(ప్రజా శంఖారావం):**

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామ సర్పంచ్ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నివాసంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేడ్ స్కూల్ అంకాపూర్ గ్రామ శివారులో 200 కోట్ల రూపాయలతో మంజూరు చేసిన ఎమ్మెల్యేకు శాలువతో సన్మానించారు. అంకాపూర్ గ్రామానికి అభివృద్ధి విషయంలో గ్రామ పాలకవర్గం పార్టీలకు అతీతంగా తొడ్పాటు అందిస్తాం అని గ్రామ సర్పంచ్ దేవేందర్ రెడ్డీ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జన్మనిచ్చిన ఊరుకు ఏమిచ్చిన రుణం తీర్చుకోలేనిదని విస్తృతంగా అభివృద్ధి చేస్తూ అంకాపూర్ గ్రామాన్ని అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉండేలా గ్రామ పాలకవర్గానికి పూర్తి స్థాయి మద్దతు ఇస్తాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తుకారాం, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**ఆర్మూర్ , జూన్ 3(ప్రజా శంఖారావం):**



ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని శ్రీ నవనాథ సిద్ధుల గుట్ట అయ్యప్ప దేవాలయంలో బుధవారం రోజును పురస్కరించుకొని నగేష్ శర్మ గురుస్వామి, ఆధ్వర్యంలో శ్రీ గణపతి, శ్రీసుబ్రహ్మణ్యం, శ్రీఅయ్యప్ప స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం, మధ్యాహ్నం 12.30 నిముషాలకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ సేవా సమితి అధ్యక్షులు చేపూరు దనంజయ్, మాట్లాడుతూ ఈ కార్యక్రమంనకు వి.అయ్యప్ప శ్రీనివాస్, అయ్యప్ప ఆలయం నిర్మాణ కర్త సహాయ సహకారం అందిస్తున్నందుకు, నవనాథ సిద్ధుల గుట్ట ఆలయ కమిటీ, దాతలకు, పాల్గొన్న అయ్యప్ప స్వామి భక్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఆ మణికంఠుడి యొక్క ఆశీస్సులు మీకు మీ కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో మణికంఠ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఉదయ్, ఉపాధ్యక్షులు కౌటికే విజయ్, కోశాధికారి సురేష్ చారి, ప్రచార కార్యదర్శి గంగా మోహన్, కార్యవర్గ సభ్యులు ఒడ్డేన్న, సలహాదారులు శ్రీహరి, నవనాథ సిద్ధుల గుట్ట కమిటీ సభ్యులు దత్తు గురు స్వామి, కొండవీటి శ్యామ్ గురు స్వామి, మోహన్ రావు గురు స్వామి, గ్యాస్ ప్రభాకర్ గురు స్వామి, నవీన్ రెడ్డి గురు స్వామి, నర్సారెడ్డి గురు స్వామి, గోవింద్ పేట్, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు



**సిద్దిపేటటౌన్ , జూన్ 3(ప్రజా శంఖారావం):**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జన్మదిన వేడుకలను సిద్దిపేట 36వ వార్డులో యాదవ సంగం వద్ద బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దరిపల్లి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేరుగు రాజనర్సు , మచ్చ వేణుగోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి , చిప్ప ప్రభాకర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, యువజన సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు భోజనాలు వడ్డించారు. హరీష్ రావు ప్రజా సేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ నాయకులు, కార్యకర్తలు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

**మనోహరాబాద్ , జూన్ 3(ప్రజా శంఖారావం):**

మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు బుధవారం మనోహరబాద్ మండలం కాల్లకల్ బంగారమ్మ ఆలయం వద్ద పురం మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు కార్యకర్తలు కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేకు కట్ చేసి సబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు శేఖర్ గౌడ్, నాయకులు లక్మన్ సింగ్ ఠాకూర్, నాగభూషణం, రేణు కుమార్, సాదు సత్యనారాయణ, మహేందర్, రాహుల్ రెడ్డి పాల్గొన్నారు.

## బాసర ట్రిబుల్ ఐటీ లో సీట్ సాధించిన విద్యార్థికి సన్మానం



**ఆర్మూర్ జూన్ 3(ప్రజా శంఖారావం):**

ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో బుధవారం రోజు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నివాసంలో తన స్వంత గ్రామమైన అంకాపూర్ కు చెందిన అంబటి వైష్ణవి, సంతోష్, దంపతుల కుమారుడు రామ్ చరణ్, బాసర త్రిబుల్ ఐటీ లో సీట్ సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పిల్లలు తల్లిదండ్రులు గర్వపడేలా ఉండాలని చదువుతో పాటు మానసికంగా, శరీరకంగా మంచి లక్షణాలు అలవర్చుకోవాలని రామ్ చరణ్, కు భవిష్యత్తులో ఏ అవసరం వచ్చిన తాను ముందుండి సాయం చేస్తానని మరింత ఉన్నతంగా ఎదగాలని కోరుకుంటున్నాను అని ఎమ్మెల్యే అన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేరుగు రాజు నియామకం



**సిద్దిపేటటౌన్ , జూన్ 3(ప్రజా శంఖారావం):**

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సిద్దిపేటకు చెందిన మేరుగు రాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మేరుగు రాజు మాట్లాడుతూ తన మీద నమ్మకంతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ ప్రధాన కార్యదర్శిగా నియమించిన ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి అన్ని విధాలుగా సహకరించిన చొప్పదండి శాసనసభ్యులు కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు చెప్పారు. ఎస్సీ డిపార్ట్మెంట్ తరపున రాష్ట్ర చైర్మన్ ఏ పిలుపునిచ్చినా ముందుండి ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహిస్తానని తెలియజేశారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ పెద్దలు రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి, సిద్దిపేట జిల్లా ఇన్చార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి, సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జ్ పూజలు హరికృష్ణకి కృతజ్ఞతలు తెలిపారు.

## కట్టా కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**కుత్బుల్లాపూర్,జూన్ 3(ప్రజా శంఖారావం):**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు కట్టా కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నియోజకవర్గం ప్రజలందరికీ తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కట్టా కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో బిజెపి రాష్ట్ర నాయకులు ఒక్కంటి దయాకర్, బీజేపీ పార్టీ నాయకులు, బీఎంఎస్ యూనియన్ సభ్యులు, సాయిబాబా నగర్ డివిజన్ బీజేపీ నాయకులు సౌరభ్ సింగ్ మరియు ఇతర ప్రముఖులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానికులకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేసి, తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, ప్రజలందరికీ కట్టా కుమార్ మరియు నాయకులు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

గురువారం
జూన్ 4, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com
ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM


# క్యాన్సర్‌ను జయించిన హంసా నందిని



సినీ ఇండస్ట్రీలో హీరోయిన్‌గా రాణించాలని ఎంతో మంది కలలు కంటూ అడుగుపెడతారు. అయితే కొందరికి మాత్రమే స్టార్‌డమ్ దక్కుతుంది. మరికొందరు అవకాశాల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటారు. అలాంటి నటీమణుల్లో ఒకరు హంసా నందిని. పూణెలో జన్మించి పెరిగిన హంసా నందిని మోడలింగ్‌పై ఆసక్తితో ముంబైకి వెళ్లారు. 2002 నుంచి మోడలింగ్ రంగంలో కొనసాగుతూ పలు టెలివిజన్ ప్రకటనల్లో నటించారు. అనంతరం 2004లో విడుదలైన లిఒకటవుదాంలి చిత్రంతో హీరోయిన్‌గా తెలుగు సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. హీరోయిన్‌గా పలు చిత్రాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయారు. దీంతో కొన్ని సినిమాల్లో రెండో కథానాయికగా నటించారు. అయినప్పటికీ పెద్దగా గుర్తింపు రాకపోవడంతో ప్రత్యేక గీతాల ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. 2013లో విడుదలైన మిర్చి, భాయ్, అత్తారింటికి దారేది, రామయ్యా వస్తావయ్యా, అలాగే లెజెండ్ చిత్రాల్లో చేసిన స్పెషల్ సాంగ్స్‌తో హంసా నందిని మంచి గుర్తింపు సంపాదించారు. అయితే కెరీర్ మంచి దశలో ఉండగానే 2021లో ఆమెకు రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు వెల్లడించారు. తన తల్లి కూడా క్యాన్సర్ కారణంగానే మరణించారని, జన్యుపరమైన కారణాల వల్ల తాను కూడా ఈ వ్యాధి బారిన పడ్డానని అప్పట్లో తెలిపారు. తీవ్ర మనోధైర్యంతో చికిత్స తీసుకుని క్యాన్సర్‌ను జయించిన హంసా నందిని ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. ప్రస్తుతం హంసా నందిని సోషల్ మీడియాలో చురుకుగా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. ఫొటోషూట్లు, వ్యక్తిగత విషయాలను పంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అలాగే మంచి పాత్రల కోసం ఎదురుచూస్తూ మళ్లీ సినీ రంగంలో బిజీ కావాలని ప్రయత్నిస్తున్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధిని జయించి జీవితంలో ముందుకు సాగుతున్న హంసా నందిని ప్రయాణం అనేక మందికి ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందించే ఉదాహరణగా నిలుస్తోంది.

# అమెరికాలో పెద్ది దూకుడు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, జాన్వీ కపూర్ కథానాయికగా నటించిన భారీ క్రీడా నేపథ్య యాక్షన్ చిత్రం 'పెద్ది' విడుదలకు ముందే రికార్డుల వేట మొదలుపెట్టింది. దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కించిన ఈ ప్రతిష్టాత్మక చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో విదేశీ మార్కెట్‌లోనూ సినిమా సెన్సేషన్ సృష్టిస్తోంది. తాజా వాణిజ్య వర్గాల సమాచారం ప్రకారం, అమెరికాలో ప్రీమియర్ ప్రదర్శనల ముందస్తు టికెట్ విక్రయాల ద్వారానే 'పెద్ది' చిత్రం 10 లక్షల డాలర్లకు పైగా వసూళ్లు సాధించింది. విడుదలకు ముందే ఈ స్థాయి వసూళ్లు నమోదు కావడం చిత్రంపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తిని స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత రామ్ చరణ్ నటించిన చిత్రాల్లో అమెరికా మార్కెట్‌లో అత్యంత వేగంగా ముందస్తు వసూళ్లు సాధించిన చిత్రంగా 'పెద్ది' నిలిచినట్లు సినీ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అమెరికాలోని పలు ప్రధాన నగరాల్లో ప్రీమియర్ షోలకు టికెట్లు వేగంగా అమ్ముడవుతుండగా, తెలుగు ప్రేక్షకులతో పాటు ఇతర భాషల సినీ అభిమానులు కూడా ఈ చిత్రంపై ఆసక్తి చూపుతున్నారు. విడుదలకు ఇంకా కొంత సమయం ఉండగానే 10 లక్షల డాలర్ల మైలురాయిని దాటడం సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సినిమా విడుదల సమయానికి 20 లక్షల డాలర్లకు పైగా ముందస్తు వసూళ్లు సాధించే అవకాశం ఉందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ నేపథ్యంతో రూపొందిన ఈ క్రీడా కథా చిత్రంలో రామ్ చరణ్ పూర్తిస్థాయి మాస్ పాత్రలో కనిపించనున్నారు. భావోద్వేగాలు, యాక్షన్, క్రీడా అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రంలోని ప్రచార చిత్రాలు, పాటలు, ట్రైలర్ ఇప్పటికే ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందాయి. ఈ చిత్రంలో జగపతి బాబు, బోమన్ ఇరానీ, శివరాజ్ కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. వృద్ధి సినిమాస్ నిర్మించిన 'పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు విదేశీ మార్కెట్‌లోనూ టికెట్ బుకింగ్స్‌కు భారీ స్పందన లభిస్తుండటంతో, రామ్ చరణ్ సినీ ప్రస్థానంలోనే అత్యంత భారీ ఆరంభ వసూళ్లు నమోదు చేసే చిత్రంగా 'పెద్ది' నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అభిమానుల దృష్టి అంతా విడుదల రోజు బాక్సాఫీస్ ఫలితాలపైనే కేంద్రీకృతమైంది.



# తారక్‌తోనే బెస్ట్ కెమిస్ట్రీ..

## ఇలియానా వ్యాఖ్యలు వైరల్

ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన ఇలియానా డి క్రూజ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తున్న ఆమె గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఎన్.టి. రామారావు జూనియర్ గురించి ఆమె చేసిన కామెంట్స్ నందమూరి అభిమానులను ఆనందంలో ముంచెత్తుతున్నాయి. తెలుగు సినీ పరిశ్రమలో మహేష్ బాబు, ప్రభాస్, రామ్, తారక్ వంటి అగ్ర హీరోలతో కలిసి నటించిన ఇలియానా, ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. "మీరు నటించిన హీరోల్లో ఎవరితో మీ స్క్రీన్ కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అయింది?" అని యాంకర్ ప్రశ్నించగా, కాసేపు ఆలోచించిన ఇలియానా "తారక్‌తోనే నా స్క్రీన్ కెమిస్ట్రీ బెస్ట్" అని చెప్పడం విశేషం. ఇలియానా, తారక్ కాంబినేషన్‌లో వచ్చిన రాఖీ, శక్తి చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 'రాఖీ' సినిమాలో వీరిద్దరి మధ్య సాగే ప్రేమకథ, పాటలు మంచి ఆదరణ పొందాయి. తారక్ ఎనర్జీకి తగ్గట్టుగా ఇలియానా చేసిన డ్యాన్స్ ప్రదర్శనలు కూడా అప్పట్లో విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఇలియానా కెరీర్‌లో పోకిరి, మున్నా, దేవదాసు వంటి భారీ విజయాలు ఉన్నప్పటికీ, నటన పరంగా మరియు స్క్రీన్‌పై అనుబంధం పరంగా తారక్‌తో ప్రత్యేకమైన కెమిస్ట్రీ ఉందని ఆమె అభిప్రాయపడినట్లు అభిమానులు భావిస్తున్నారు. ఇలియానా చేసిన ఈ వ్యాఖ్యలు పాతవే అయినప్పటికీ, ప్రస్తుతం తారక్ గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందుతున్న నేపథ్యంలో ఈ వీడియోను అభిమానులు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. "తారక్‌తో ఇలియానా జోడీ ఎప్పటికీ ప్రత్యేకమే" అంటూ నందమూరి అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, వివాహం అనంతరం సినిమాలకు దూరంగా ఉన్న ఇలియానా ప్రస్తుతం తన ఇద్దరు కుమారులతో కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తూ సోషల్ మీడియాలో అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు.

# అబద్ధపు వేధింపుల కేసు పెట్టా

## నటి శిల్పా షిండే..



ప్రముఖ టెలివిజన్ నటి శిల్పా షిండే చేసిన తాజా వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దాదాపు పదేళ్ల క్రితం ఓ నిర్మాతపై తాను అబద్ధపు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశానని ఆమె స్వయంగా వెల్లడించడంతో సోషల్ మీడియా, టెలివిజన్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'భాభీజీ ఘర్ పర్ హైన్!' సీరియల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన శిల్పా షిండే ఇటీవల ఓ పోడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన వివాదంపై స్పందిస్తూ, 2017లో నిర్మాత సంజయ్ కోహ్లిపై నమోదు చేసిన లైంగిక వేధింపుల ఫిర్యాదు నిజం కాదని అంగీకరించారు. ఆ సమయంలో కాంట్రాక్ట్‌కు సంబంధించిన వివాదాలు, పెండింగ్ చెల్లింపులు తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయని, గత్యంతరం లేక ఆ కేసు పెట్టాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. అనంతరం తనకు రావాల్సిన చెల్లింపులు అందిన తర్వాత ఇరు పక్షాలు కోర్టు వెలుపల రాజీ చేసుకుని కేసును ముగించుకున్నట్లు వెల్లడించారు. శిల్పా చేసిన ఈ వ్యాఖ్యలపై ఢిల్లీలోని పురుషుల హక్కుల కోసం పనిచేస్తున్న ఓ సంస్థ తీవ్రంగా స్పందించింది. తప్పుడు లైంగిక వేధింపుల కేసు పెట్టినట్లు స్వయంగా అంగీకరించిన నేపథ్యంలో ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే అరెస్ట్ చేయాలని ముంబై పోలీసులను కోరింది. నిజమైన బాధితులకు రక్షణ కల్పించేందుకు రూపొందించిన చట్టాలను దుర్వినియోగం చేయడం ఆందోళనకరమని ఆ సంస్థ పేర్కొంది. ఇలాంటి ఘటనలు చట్టాల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. ఇక శిల్పా వ్యాఖ్యలపై సినీ, టెలివిజన్ వర్గాల్లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమెను తీవ్రంగా విమర్శిస్తుండగా, మరికొందరు నిజాన్ని బహిరంగంగా ఒప్పుకున్నందుకు ఆమె ధైర్యాన్ని అభినందిస్తున్నారు. ప్రస్తుతం శిల్పా షిండే, నిర్మాత సంజయ్ కోహ్లి కుటుంబంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. అయితే ఆమె తాజా వ్యాఖ్యల నేపథ్యంలో ఈ వ్యవహారం మళ్లీ చర్చకు రావడంతో, భవిష్యత్తులో దీనిపై మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

# పండు మాస్టర్‌కు రోడ్డు ప్రమాదం



తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు సుపరిచితమైన ప్రముఖ నృత్య దర్శకుడు, నర్తకుడు పండు మాస్టర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. విశాఖపట్నం జిల్లా ఆనందపురం సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం ప్రకారం, తగరపువలసలో నిర్వహించిన అమ్మవారి ఉత్సవాల్లో ప్రత్యేక నృత్య ప్రదర్శనలో పాల్గొన్న పండు మాస్టర్, కార్యక్రమం ముగిసిన అనంతరం తన బృందంతో కలిసి తిరుగు ప్రయాణం ప్రారంభించారు. ప్రయాణ మధ్యలో బృందంలోని ఓ సభ్యుడు అస్వస్థతకు గురికావడంతో వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో పండు మాస్టర్ వాహనం నుంచి దిగి రోడ్డుపై నిలబడి పరిస్థితిని గమనిస్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ కోళ్ల రవాణా వాహనం అదుపుతప్పి ఆయనను ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అనంతరం ఆ వాహనం ఎదురుగా నిలిపి ఉన్న మరో కారును కూడా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పండు మాస్టర్‌ను స్థానికులు, ఆయన బృంద సభ్యులు వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది. అయితే ఆయన ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, దెబ్బతిన్న ఇతర వాహనాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం లేదా ఇతర కారణాల వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. ప్రముఖ నృత్య కార్యక్రమాల ద్వారా గుర్తింపు పొందిన పండు మాస్టర్, తన ప్రత్యేక నృత్య శైలి, నృత్య దర్శకత్వంతో తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించుకున్నారు. టెలివిజన్ కార్యక్రమాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే సాంస్కృతిక వేడుకల్లోనూ ఆయన చురుకుగా పాల్గొంటున్నారు. ఇలాంటి సమయంలో ఆయనకు ప్రమాదం జరగడం అభిమానులను కలవరపెడుతోంది. పండు మాస్టర్ త్వరగా కోలుకోవాలని అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రార్థనలు చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PUTTI MURALI, PRINTED AT INDUR OFFSET PRINTERS, OPP : CHEER HANUMAN TEMPLE, WEEKLY BAZAR,NIZAMABAD- 503001, NIZAMABAD DISTRICT, TELANGANA STATE, PUBLISHED AT HNO.1-86/10/05, KOTARMOOR(PERKIT), ARMOOR-503224, NIZAMABAD DISTRICT, TELANGANA STATE. EDITOR : PUTTI MURALI, TELTEL/2022/85170, EMAIL :prajashankaravam@gmail.com